# అమ్మ పిలుపు

జె.వి.బి. నాగేశ్వర రావు



నా తల్లి పిలుస్తోంది... నిజమో, అబద్ధమో తెలియటం లేదు కానీ నన్ను కన్న మా అమ్మ పిలుస్తున్నట్టుగా వినిపిస్తోంది.

"...ఒరే రాజూ! ఒక్కసారి వచ్చి వెళ్లరా!!" అని అమ్మ పిలుస్తోంది.

నేను వెళ్లాలని అనుకుంటున్నాను. కానీ నా అవయవాలు సహకరించటంలేదు. కాళ్లూ, చేతులూ, కూడదీసుకుని లేచి వెళ్లాలనుకుంటున్నాను. ఒక్క ఉదుటున లేచి వెళ్లిపోదామని ప్రయత్నించాను.

ఉధృతంగా నొప్పి కలిగి మెలుకువ వచ్చింది. కాళ్లు రెండూ బేండీజీల్లో ఉన్నాయి. సెడెటివ్ ప్రభావం తగ్గిపోయింది కాబోలు, కండరాల్లో నొప్పి దుస్సహంగా ఉంది. కుడి చెయ్యి కూడా కట్టులోనే ఉంది. ఎడమ చెయ్యి స్వాధీనంలోనే' ఉంది గానీ, దాన్నుంచి సెలైన్ నా రక్తనాళాల్లోకి ఇంకుతోంది.

నాకు విషయం బోధ పడింది. ఏక్సిడెంట్‌లో ఆఖరి నిముషంలో... కాదు... కాదు... క్షణంలో అనుకుంటాను... చచ్చిపోతున్నాననుకున్న నేను చచ్చిపోలేదన్న మాట. ఇంకా మరి కొన్నాళ్లు నాకీ భూమ్మీద నూకలు మిగిలే ఉన్నాయన్నమాట... సంతోషం కలిగింది. కానీ ఏ మూలో ఒక భయం పుట్టి పెద్దదవుతోంది. అస్పష్టంగా ఉంది. దాని కారణం.

ఎడమ చేతినెత్తి మొహం తడుముకుని చూసుకోవాలని అనుకున్నాను. కానీ సెలైన్ గొట్టం ఉండటం వల్ల కుదరలేదు. పెదాలు కదిపి ఎవర్నైనా పిలుద్దామనుకునేసరికి పై పెదిమ భగ్గున మండింది. నాకు పిచ్చెక్కినట్టయింది.

ఓ నిముషం పాటు పై కప్పు మీద నిశ్శబ్దంగా తిరుగుతున్న తెల్లటి సీలింగ్ ఫేన్ వంక చూశాను. నాది స్పెషల్ వార్డు అనుకుంటాను. అదే హాస్పిటల్‌లో కానీ బాగా ఖరీదైనదే అయివుండాలి. నా వెనుక పక్క ఏముందో కనబడటంలేదు గానీ, నా కెదురుగా కుడి పక్క పొడవైన గ్లాస్ పేన్‌తో, తెల్ల పెయింట్ వేసిన స్వింగ్ డోర్ ఉంది. డోర్ క్లోజర్ కూడా తెల్లగానే ఉంది. అక్కడ ఉన్న రంగంతా తెలుపే. కుడి పక్క మూలగా, తెల్ల టేబులూ, దాని మీద తెల్లటి ఫోను కూడా మాకూ మినహాయింపేం లేదని చెపుతున్నాయి.

కొన్ని నిముషాలు నాలో ఏ ఆలోచనా లేదు. అవును యుద్ధం పూర్తయిపోయేక, యుద్ధరంగంలో మిగిలేదేముంటుంది కనుక మృతకళేబరాలూ, విధ్వంస ఫలితంగా రేగుతున్న పొగలూ తప్ప... నాకేం అనుమానం లేదు. అంతా ముగిసిపోయుంటుంది. అందుకే, శరీరం విశ్లదమైపోయినా, ఏ ఆలోచనా లేకుండా మనస్సు మాత్రం ప్రశాంతంగానే ఉంది. క్రమంగా, ఒకటొక్కటిగా ఆలోచన్లు పేర్చుకుంటున్నాను.

ఇంతలో చప్పుడు కాకుండా గది తలుపు తెరుచుకుంది. చేతిలో ట్రే పట్టుకుని ఓ నర్సు లోపలికి ప్రవేశించటం కనిపించింది. నేను కళ్లు మూసుకున్నాను. ఆమె నా మీదకి వంగి చూస్తున్నట్టుంది. ఇబ్బందిగా అనిపించి కళ్లు తెరిచేను. ఆమె ముక్కు నున్న తెల్ల రాయి ముక్కు పుడక తళుక్కుమని మెరిసింది. పెద్దవిగా ఉన్న ఆ కళ్లలోకి సూటిగా చూసేను. ఆమె నల్లటి కంటి పాపలు నా చూపుల్తో కలిసేయి. వాటిలో ఉన్న భావం ఆందోళనో, లేక ఆనందమో నేను పోల్చుకోలేకపోయేను.

నా బెడ్ పక్కనే ఉన్న మెడిసన్స్ ఛెస్ట్ మీదున్న ట్రేలోంచి, ఓ అరవిరిసిన గులాబీని, రెండే రెండు లేత ఆకుపచ్చటి ఆకుల్తో ఉన్నదాన్ని నా పక్కనే బెడ్ మీద ఉంచుతూ,

"కంగ్రాట్యులేషన్స్... మిస్టర్ నందరాజ్... మీరు నిజంగా చాలా అదృష్టవంతులు. ఇప్పుడు మీ కెలా ఉంది? ఏమైనా కావాలా?" అని మృదువుగా నవ్వుతూ అడిగింది ఇంగ్లీషులో.

నాకు నిజంగా నవ్వొచ్చింది. వందల కొద్దీ ఇంటర్వ్యూలు ఇలాగే మొదలయ్యేవి. నేను విదేశాల్లో షూటింగులు ముగించుకుని వచ్చేసరికి. ఇదినేను పైలో కాల అంచుల వరకూ పోయి, వెనక్కొచ్చిన తర్వాత జరుపుతున్న మొదటి ఇంటర్వ్యూ.

మాట్లాడాలనుకున్నాను. మళ్లీ పై పెదిమ నొప్పి పుట్టింది. అయినా సన్న వచ్చిన నాస్వరం ఆమెకి వినిపించిందో, తెలీలేదు కానీ నాకు మాత్రం వినిపించింది.

"థేంక్ యూ సిస్టర్.... మీరు నిజంగా నాకు సహాయం చేయాలనుంకుంటే ముందో అద్దం పట్టుకు రండి!"

ఆమె ఒక్కక్షణం తెల్లబోయి అంతలోనే నవ్వేసింది.

"వండర్ ఫుల్ సెన్సాఫ్ హ్యూమరుంది మీలో....ముందు డాక్టరుగారొచ్చి చూసేక, తప్పకుండా మీరడిగింది తెస్తాను.... అందాకా కొంచెం వేడిగా కాఫీ ఇమ్మంటారా?"

"అంత కంటేనా...ఇవ్వండి" - నాకు ఇంతకు ముందేమోగానీ, ఇప్పుడు మాత్రం అందమైన, యవ్వన ప్రాయంలోని ఆ నర్స్ బదులుగా తల్లిలాంటి నడి వయస్సు స్త్రీ ఎవరైనా వచ్చి ఉంటే బాగుణ్ణనిపించింది. కానీ వైద్యం ఒక పెద్ద బిజినెస్ అయిపోయిన ఈ రోజుల్లో అందాని కున్న ప్రాధాన్యత, అనుభవానికుండటంలేదు. కాఫీ తేడానికి చప్పుడు చెయ్యకుండా వెళ్లిపోయిందామె.

ఆగిపోయిన వర్షం మళ్లీ మొదలైనట్టు, తెగి పోయిన ఆలోచనలు సన్నగా ప్రారంభమై.... దట్టంగా ముసురుకున్నాయి.

లక్నో సమీపంలో 'విధ్వంసం' షూటింగ్ అయిపోయి ఫ్లైట్‌లో మద్రాసు వచ్చేయడానికి ఏర్‌పోర్ట్‌కి వెళుతుండగా అయింది ఏక్సిడెంట్. ఏక్సిడెంట్ అవడానికి అరగంట ముందు, 'దంతిపాలెం' నుండి తమ్ముడిచ్చిన టెలిగ్రాం అందింది.

'మదర్ సీరియస్....వాంట్స్ టు సీయూ...స్టార్ట్ ఇమ్మీడియేట్లీ" - శేష.

నాలో ఆ టెలిగ్రాం చూసేక అహం బుసలు కొట్టింది. షు ఇప్పుడన్న మాట....చచ్చే కాలంలో ఆమెకి కొడుకు కావల్సొచ్చేడు....ఎన్నిసార్లు చెప్పేను. ఎంత బతిమలాడేను. ఆఖరు సారి తన్తోరమ్మన్నప్పుడేమంది.

"ఒరే రాజా! నీకిప్పుడు తెలీటం లేదు. రంగు పూసుకుని నువ్వు చేసేనటనే, నీకు తల్లేపోయినప్పుడు, నీకు రక్త సంబంధం నిజంగా అక్కర్లేదు. నీకు అభిమానాలు, ప్రేమానురాగాలూ, అన్నీ నటనేరా...ఒక్కసారి నువ్వు వెనక్కి తిరిగి చూసుకో....ఏ బాధ్యతా పట్టకుండా నువ్వు చేసిన పనులన్నీ... నీ ప్రవర్తన నీ ఆత్మ సాక్షిగా విమర్శించుకో... అప్పటికీ నువ్వు...నువ్వే రైటనుకుంటే, ఇక మీదట నన్ను రమ్మనడానికే కాదు...., నా మొఖం చూడ్డానికి కూడా నువ్వు రానక్కర్లేదు -"

దాంతో నా మనస్సు మండిపోయింది. ఆమె దృష్టితో చూస్తే నేనెన్నో తప్పులు చేసుండవచ్చు. కానీ దేనికోసం... నేను త్రికరణ శుద్ధిగా నమ్మిన దానికోసమే, ఆ తపస్సులో భాగంగానే నేనవన్నీ చేశాను. నన్ను ఆవిడ అర్థం చేసుకోలేదన్న మంటతో, మళ్లీ నేనావిడ్ని ఎప్పుడూ రమ్మన లేకపోయేను. ఆవిడ తలంపు కూడా రాకుండా



"మీ అబ్బాయి 'లా' చదివాడటగా ఎలా ఉందిరా ప్రాక్టీస్". స్నేహితుణ్ణి అడిగాడు ఈశ్వర్.

'ఎలా ఉండటమేమిటి ఆస్తిని పంచమంటూ నా మీదే మొదటి కేసు వేశాడు'. నీరసంగా చెప్పాడు విష్ణు.

— అశోక్
బస్వాపూర్

చేసుకున్నాను.

కానీ టెలిగ్రాం అందిన పది నిముషాలకి, కార్లో వెళ్తుండగా, చిత్రంగా నామనస్సులో ఏమూలో, వేదన బయల్దేరింది. మరోసారి టెలిగ్రాం చదువుకున్నాను. "మదర్ వాంట్స్ టు సీయూ..." ఆ మాటల దగ్గర నా నేత్రాలు ఆగి పోయాయి...అంతలోనే 'ధన్' మన్న పెద్ద చప్పుడుతో కారు దేన్నో గుద్దుకుంది.....

అమ్మ రూపం కళ్లముందు మెదిలింది. నా చిన్ననాటి అమ్మ. పొడవుగా, అశోక చెట్టులా ఉండే అమ్మ. ఆవిడ ఎడం చెక్కిలి మీద కోలగా ఉండే నల్లటి మచ్చ ఎన్నిసార్లో వేలితో రాస్తూ అడిగేవాణ్ణి.

" ఈ మచ్చ ఎలా వచ్చిందే అమ్మా! " అని.

ఆవిడ చెప్పే సమాధానం ఇప్పటికీ నాచెవుల్లో వినబడుతున్నట్టే ఉంది.

"నాకో కవల చెల్లెలుండేదిరా!... అది అయిదేళ్లు బతికి పోయిందనుకో... కానీ మేం చిన్నప్పుడు వుయ్యాల్లో ఉన్నప్పుడు మా పిచ్చి బాబయ్య లేడూ...అతగాడు మా ఇద్దరికీ తేడా కోసం నా బుగ్గ మీద చుట్ట కాల్చి అంటించేడంట్రా... అదీ ఆ మచ్చ..."

"నీకప్పుడు నొప్పి పుట్టలేదూ..." అనేవాణ్ణి.

"ఏమోరా? పుట్టకుండా వుంటుందా!? నొప్పి పుట్టే వుంటుంది. బాగా ఏడ్చేనేమో కూడా!... అయినా నీకెందుకురా... ఈ అనవసర ప్రశ్నలు. పోయి చదువుకోక..." — అనేది.

అమ్మకి ఎప్పుడూ తీరికనేది లేకుండా ఏదో పని వుంటూనే వుండేది. ఆవిడది చాలా పొడవాటి జుత్తు. కానీ తీరిక లేకపోవడం చేత వేలుముడే వేసుకునేది. ఎప్పుడైనా ఓసారి తీరిక దొరికితే, పెరట్లో ఎండలో పీటేసుకు కూర్చుని, చిక్కు తీసుకుంటుంటే, వెనకాతలే వెళ్లి, ఆవిడ వీపు మీద వాలి, నల్లటి ఆ వెంట్రుకల పాయల్తో మొహం కప్పుకుంటూ సంబరపడిపోయేవాణ్ణి. చాలా అరుదుగా నాకా అవకాశం దొరికేది. ఆవిడ చికాకు పడేది. విసుక్కుంటూ,

"వదల్రా... రాజా... నేను జడేసుకోవాలి". తర్వాత ఇంకా చాలా పన్లున్నాయి" అనేది.

అంతవరకూ, కళ్లు మూసుకుని అమ్మ వూహాల్లో విహరిస్తున్నానేమో,

"మిస్టర్ నందరాజ్... ఆర్యూ ఎస్లీప్?" అన్న స్వరం పక్కనే వినబడ్డంతో, వులిక్కిపడి కళ్లు తెరిచేను. డాక్టర్ ఆనందరామ్. నాలుగు పదుల వయస్సు. రెండు, మూడు ఖండాల్లో సంపాదించిన డిగ్రీలు, అతితక్కువ కాలంలోనే గడించిన అపారమైన కీర్తీ, ధనమూ, ఆ వ్యక్తికి ఓ విధమైన తేజస్సునిచ్చేయి. నాకు దగ్గిర సర్కిల్‌లోని మిత్రుడూ, మద్రాస్‌లో నా పర్సనల్ డాక్టర్ కూడా.

"హలో డాక్టర్... మీరెప్పుడు వచ్చేరు?

"మూడు రోజుల కిందట నందూ.. నీకు ఏక్సిడెంట్ అయినట్టు నాకు లైట్నింగ్ కాల్ అందడంతోనే బయల్దేరి వచ్చేను... ఇంక నీకేం ఫర్వాలేదు కనుక ఈ రాత్రికి వెళుతున్నాను... ఏమంటావు నందరాజ్..." — నన్ను పరీక్ష చేస్తూనే మాట్లాడేడు.

"—అవునూ... నువ్వు డూప్ లేకుండా చేశావుట... పత్రికల్లో తెగరాస్తున్నారు. ఎందుకు చేశావలా...?" — కళ్ళద్దాల్లోంచి అతడి కళ్లు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తున్నాయి.

నాకు పగలబడి నవ్వాలని పిచ్చికోరిక కలిగింది... పబ్లిసిటీ... 'విధ్వంసం' కోసం బ్రహ్మాండమైన పబ్లిసిటీ అప్పుడే మొదలైపోయిందన్న మాట. మరి దాని సక్సెస్‌కి తిరుగులేదు.

"డాక్టర్... దాన్నలా వుంచండి... ముందు నాకీ సంగతి చెప్పండి.. ఎన్ని ఫ్రాక్చర్లయ్యేయి. ఫేంగియల్ డామేజెస్ ఏమైనా వున్నాయా?... తగ్గడాని కింకెన్నాళ్లు పట్టొచ్చు??"...

డాక్టర్ హుషారుగా నవ్వేడు... "ఆగు... కొంచెం ఆగు నందూ! అన్ని ప్రశ్నలూ ఒక్కసారే...?" — తల పంకించేడు.

"నీకేం ఫర్వాలేదు. నీ కెరీర్ ఈ ఏక్సిడెంట్ వల్ల ఏం దెబ్బతినదు. నే చెప్తున్నాగా... రెండు నెలల్లో మామూలు మనిషవుతావు. ఆరు నెలల్లో నువ్వు మళ్లీ నీ బ్రేకులూ, షేకులూ మొదలెట్టొచ్చు. ఓ.కె...? ఇంక రెస్ట్ తీసుకో..." — అంటూ తన పరీక్షలు చురుగ్గా పూర్తిచేసి, తనే స్వయంగా నాకో ఇంజక్షన్ చేసేడు.

నల్ల కలువ లాటి ఇందాకటి నర్స్‌ని పిలిచి, ఏవో కొన్ని సూచనలిచ్చేడు.

"సీయూ ఎగైన్... నువ్వేం పర్రీకాకు. మళ్లీ రెండ్రోజుల్లో వస్తాను. ఈలోగా నీకేం కావాలన్నా యూ కెన్ ఆస్క్ హర్. బై..." — ఆయన వెళ్లిపోయేడు. సన్నగా కనుగీటినట్టనిపించింది.

నర్సుని పిలిచేను... "సిస్టర్..."

"స్టెల్లా రోజ్... కాల్ మీ స్టెల్లా" — ఆంగ్లో ఇండియన్ యాన, ఆమెకి తెలుగు కంటె ఇంగ్లీష మాట్లాడటమే ఇష్టం అని చెపుతోంది.

"కొంచెం కాఫీ ఇస్తావా?" కావాలనే తెలుగులో అడిగేను.

"ష్యూర్..." ఆమె ఇంగ్లీష వొదల్లేదు. నాకు కమ్మగా కాసేపు తెలుగు పాట వినాలనిపించింది. అమ్మ తమ్ముళ్లనూ, చెల్లెళ్లనీ ఉయ్యాలూపుతూ పాడే పాట 'జో అచ్యుతానంద, జోజోముకుందా,' హఠాత్తుగా జ్ఞాపకం వొచ్చింది. ఎందుకో గుండె బరువెక్కింది. కళ్లు తడయినట్టున్నాయి. పైన తిరుగుతున్న ఫేన్ మసగ్గా కనిపిస్తోంది.

"ఉద్యోగం ఎలానూ రాలేదు. నువ్వు వ్యవసాయం కూడా చూసుకోవన్న మాట... ఎదిగి, చేతికందొచ్చిన కొడుకున్నా... ఇంకా నేనే అన్నీ చూసుకుంటుంటే, అదేమంత బాగుండదు. లోకం నవ్వుతుంది." - నాన్న పోయిన పదేళ్ళబట్టీ, ఇంటి పనీ, పొలం పనీ తానే

చూనుకుంటూ వస్తున్న అమ్మ ఆ రోజు నన్ను గట్టిగా నిలదీసింది. నేనేం మాట్లాడ లేదు. వరిషత్తు పోటీల్లో వస్తున్న ఉత్తమ నటుడి బహుమతులు, నాకు సంసార బంధాల్లోంచి బయటపడి, కళారంగంలో స్వేచ్ఛగా విహరించడానికి కరదీపికల్లా తోస్తున్న రోజులవి. ఇల్లు పట్టకుండా ఊళ్లమీద పడి తిరుగుతున్న కాలమది.

"ఇంటికి పెద్దవాడివి. బాధ్యతలు చాలా వున్నాయి. చెల్లెళ్ల పెళ్లిళ్లూ, తమ్ముళ్ల చదువులూ జరగాలంటే, ఉన్న కాస్తంత భూమి జాగ్రత్తగా పండించుకోకపోతే మనకు జరగదు. నేనేమో ఆడదాన్ని... రెండు వక్కలా చేసుకో లేకపోతుంటే, నువ్విలా ఇల్లు పట్టకుండా... ఎప్పుడు వెళ్తావో, ఎప్పుడు వస్తావో తెలీకుండా, ఆగమ్మ కాకిలా రంగుపూసుకుని తిరగటం నాకు నచ్చలేదు. నాకది ఇష్టం లేదు. ఇవ్వాళ నుంచీ నువ్విల్లు కదిల్తే నేనూరు కోను..." అమ్మ బాగా కోపంగా ఆ మాటలంది. ఆవిడ కళ్లు రెండూ చిన్నవై, నుదురు ముడతలు పడింది.

నేనూ నిష్కర్షగానే చెప్పేను. "నేను నాటకాలు మానలేను... వ్యవసాయం నా వల్ల కాదు. నువ్వు కూడా చెయ్యలేకపోతే, ఎవరో ఒకర్ని చూసి పాలుకిచ్చెయ్యి. నన్ను ఇంట్లో వుండొద్దు అని నువ్వంటే, ఈ క్షణమే వెళ్లిపోతాను. కానీ, ఇల్లు కదలొద్దు అని మాత్రం నువ్వనొద్దు..."

బదులుగా అమ్మేం మాట్లాడలేదు. ఆవిడకి పట్టరాని కోపం వస్తే అసలు మాట్లాడదు. కింది పెదిమ పై పంటితో కరిచిపెట్టి, తీక్షణంగా చూస్తుంది. ఆ చూపుల్ని తట్టుకోవడం కష్టం. ఐతే అప్పుడు మాత్రం, నేనావిడ చూపుల్ని లెక్కచెయ్యలేదు. కొత్త స్క్రిప్టు 'అడుగు జాడలు' చదువుకోవడంలో మునిగిపోయేను. ఆవిడ వెనక్కి తిరిగి గబగబా వంటింట్లోకి వెళ్లిపోతుంటే ఆవిడ కట్టుకున్న వంగపండు రంగు నేత చీర, తాలూకు, నీలిరంగు పైట చెంగు నా పట్ల ఆవిడ నిరసన భావాన్ని తెలియజేస్తున్నట్లు వినురుగా గాల్లో కదులాడింది.

ఆ తర్వాత నేను మా ఊళ్లో వున్న రోజులు చాలా తక్కువ. 'అడుగు జాడలు'లో నా పాత్ర పోషణ నన్ను చిత్రంగా మద్రాను చేర్చింది. అవకాశం అదృష్టం రెండూ కూడా కలసి రావడం చేత నా మొదటి చిత్రం విజయాన్ని సాధించింది. ఆ తర్వాత విజయపరంపర మరి ఆగకపోవటం వల్ల నేను వెను తిరిగి చూసే సమయం, అవకాశం కూడా నాకు లేకపోయింది.

"క్షమించాలి! మీకు ఫోన్... తీనుకురమ్మంటారా?" స్టెల్లా నామీదకి వంగి అడుగుతూంటే, నా జ్ఞాపకాలు చెదిరిపోయేయి.

"ఎవరు?"

"మీ పి.ఏ. ఏకాంబరం గారట. మీకు మెలుకవ రాగానే మాట్లాడించమని ఇప్పటికి ఓ వదిసార్లు ఫోన్ చేసేరు. మాట్లాడతారా?"

"తీనుకురా... స్టెల్లా!" పై పెదిమ బాధగా వుండటంతో నాకు మాట్లాడాలన్న ఆనక్తి పోయింది. నాకెందుకో గాని మరి నా పాత జీవితం నాది కానట్టూ, ఎక్సిడెంట్‌తో పాటు, నేను పునర్జన్మఎత్తినట్టూ చిత్రమైన భావం కలిగింది.

"హల్లో నందరాజ్‌సాబ్...! కంగ్రాట్స్... మీ ఒంట్లో ఎలా వుంది? - ఉత్సాహం తొణికినలాడుతుండగా అగిడేతను. ఫక్తు ఫార్మాలిటీ... "ఫర్వాలేదు.. ఏకాంబరం... కానీ.... నేను మళ్ళీ యాక్ట్ చెయ్యాలంటే, ఆరునెల్లు పడుతుందంటున్నారు డాక్టర్... అప్పుడు కూడా ఇంకా అనుమానమే... అన్నారు..."




మా పనిమనిషిని ఎందుకు మాన్పించామంటారా?... మనం విశాఖపట్నం నుంచి వస్తూ రైల్లో భోజనం చేశాక ప్లేట్లు ఇవ్వకుండా తెచ్చామే వాటిని దొంగలించుకెళ్ళింది...'

-సుకుమార్
మచ్చబొల్లారం

"అన్నన్నా... పెద్ద చిక్కే వచ్చింది. పాత ప్రొడ్యూసర్లు బెంగ పెట్టేసుకున్నారు. కొత్తగా ఎడ్వాన్సులిచ్చినవాళ్లు. నా చుట్టూ తిరుగుతున్నారు. అభిమానులయితే మరి చెప్పనే అక్కరలేదు. దేవాలయాల ముందూ, మీ ఇంటి దగ్గిరా వందలూ, వైలుగా చేరిపోయున్నారు... నన్నేం చెయ్యమంటారో, చెప్పండి... నాకేం తోచటంలేదు.."

'గేటు హెలో' అందామనుకున్నాను. పట్టుదారాల సాలెగూడు.. నా చుట్టూ నేనే అల్లేసుకున్నాను. అందుకే నేనా మాట అనలేదు. బాగా ఆలోచించేను. నెమ్మదిగా జవాబు చెప్పేను.

"అభిమానులకి కృతజ్ఞతలు చెప్పండి. పాత ప్రొడ్యూసర్లు ఓపిక పడితే, నాకు నయమవ్వగానే వాళ్ళ పిక్చర్లు పూర్తి చేస్తానని చెప్పండి. కొత్తవాళ్ళందరి ఎడ్వాన్సులూ తిరిగిచ్చెయండి. నందరాజ్ మరి సినిమాల్లో వుండటంలేదు.. నో సెకండ్ థాట్ ఇన్ దట్..."-

"నందరాజ్‌గారూ...!!"- అతని ఆశ్చర్యం నాకేం ఆశ్చర్యం కలిగించలేదు. నా మనోభావాలు నన్ను ఆ నిర్ణయానికే పురిగొల్పుతున్నాయి. నాకేం బాధగా లేదు. నాకు విముక్తి కావాలి. ఇంతవరకు కనబడని దూరాలకు పరిగెత్తి, పరుగెత్తి, ప్రశాంత జీవన రాదార్లన్నీ దాటిపోయేను. ఇక మీదట నాకు పరుగెత్తాలన్న కోరిక చచ్చిపోయింది. నాకు నావాళ్లు కావాలి. నా తల్లీ, తోబుట్టువులూ, అందరూ కావాలి. తప్పిపోయిన గొర్రెపిల్లలా. ఎక్కడెక్కడో తిరిగిన నేను నా వాళ్ళను చేరుకోవాలి.

"నేను చెప్పిట్టు చెయ్యండి ఏకాంబరం. నా నిర్ణయం మారదు. అన్నీ నేను చెప్పినట్టు చేశాకే మళ్ళీ ఫోన్ చెయ్యండి.' దృఢంగా చెప్పేను.

నాకు స్మృతుల పరిమళం అత్యంత మధురంగా అనిపిస్తోంది. నాకు తెలును, నా ఈ నిర్ణయంతో, సినీ ప్రపంచం, అభిమానుల బాహుళ్యం కలగుండుపడిపోతుంది. అయినా నేనేం పట్టించుకోను. జీవితమంతా నటనేకాదనీ, నిజాయితీగా జీవించాల్సిన అవసరం వుందనీ, నాకు స్పష్టంగా అర్థమైపోయేక, మరింక విచారం లేదు.

కానీ అమ్మ... నన్ను చూడాలనుకున్న నా వెర్రితల్లి. వుందో... లేదో.. ఎలా తెలుస్తుంది. చటుక్కున ఆలోచన తట్టింది.

"స్టెల్లా.. స్టెల్లా... గట్టిగా కేకేశాను.

ఒక్క వుదుటన వచ్చిందామె. "దంతిపాలెం' పి.పి.పెట్టు". శేమ ఎడ్రస్ చెప్పేను.

మనను నహకరించకపోయినా, ఆలోచనా భారంతో అలసి పోయిన మెదడు విశ్రాంతి కోరుతుండగా, నేను నెమ్మదిగా నిద్రలోకి జారుకున్నాను.

★ ★ ★

నుదుటి మీద చల్లగా తడి తగిలింది. చటుక్కున కళ్లు విప్పేను. ఎవరో నా శరీరాన్ని నిమురుతున్నారు. ముడుతలు పడిన చెక్కిలి నా కళ్ల కడ్డంగా వుంది. గుండె వేగంగా కొట్టుకుంటుండగా, పైకి చూసేను. కోలగా పొడవుగా ఉన్న ఆ మచ్చ... ఎవరు. ఎవరది. అమ్మలావుంది... అవును.. అమ్మే.. అమ్మే వచ్చేసింది..

నా కోసం.. నన్నుకన్న మా అమ్మ వచ్చింది. ముడుతలు పడి, ఎండిపోయినట్టున్న ఆ చెయ్యి నా జుత్తుని నిమురుతోంది. అది నా బుగ్గల మీదకి వచ్చేసరికి, మరి కాసేపు ఆస్పర్శ అనుభవించాలపించి, చప్పున కళ్లు మూసేనుకున్నాను. నాకు కల కంటున్నట్టుంది. మత్తుగా, మధువు తాగినట్టుంది.

"నన్ను రావొద్దంది.. నీ మొహం చూపెట్టొద్దూ. అంది.. ఇప్పుడు ఆ పంతం ఏమైపోయిందో, పిచ్చి అమ్మ తానే రెక్కలు కట్టుకుని వాలిపోయింది. అష్టైశ్వర్యాలతో తులతూగుతున్నపుడు రాలేదు.. సుఖాల పరుపుమీద నేను పొర్లాడుతున్నపుడూ రాలేదు. ఇప్పుడు ఈ హాస్పిటల్ మంచం మీద, మృత్యువుకి, మూడంగుళాల దూరంలోంచి నేను తప్పించుకు వచ్చినవుడు—

"నాన్నా...! రాజూ!! వెళ్లిపోకురా... నీకోసం, నేనున్నాన్రా.." అంటున్నట్టుగా తానే వచ్చింది. అవును మరి.. ఎంతైనా అమ్మ.. అమ్మే కదా? – మూసిన నా కళ్ల రెప్పల సందుల్లోంచి కన్నీళ్లు గవ్వల్లా జారిపోతున్నాయి.

అమ్మ స్పర్శ హాయిగా వుంది.

శీతల సమీరంలా వుంది..

చందన *గంధంలా* వుంది...

అమ్మ నెమ్మదిగా పిలుస్తోంది?

"నీ మొహం చూపెట్టకురా, అన్నానని అమ్మనే మోసం చేద్దామనుకున్నావురా.. బాబూ! నువ్వే.. వెళ్లిపోదామనుకున్నావా?.. నేను వచ్చేనా.. వెయ్యేనుగుల బలం తెచ్చుకుని, నీ కోసమని వచ్చేన్రా.. ఒక్కసారి నన్ను చూడ్రా రాజూ?" ఎన్నాళ్ళైంది ఆ కంఠం విని. ఎన్నేళ్లైంది. ఆ ఆప్యాయత చవి చూసి.

కళ్లు వీలయినంత విశాలంగా చేసి, మా అమ్మని, ఆ పలితకేశాల పావనమూర్తిని, కళ్లారా చూసేను.

దుఃఖ భారంతో ఆవిడ మొహం మలినమైవుంది. నేను కన్నులు తెరిచి చూడగానే, జీవం వుడిగి పోతున్నట్టున ఆవిడ నేత్రాలు వేయి వెన్నెలలు విరజిమ్మేయి.

ఎడమ చేయి ఎత్తి ఆవిడ వీపు మీదుగా చుట్టేను ఆర్తిగా... సెలైన్ గొట్టం వూడిపోయినా లెక్కజేయలేదు. నా తల్లి వచ్చేక మరినాకు సెలైన్ అవసరం ఏముంది కనుక..

ఎన్నేళ్ల బట్టో పిలవటం మరిచిపోయిన 'అమ్మా!' అన్న పిలుపు నాభి దగ్గర్నుంచి అప్రయత్నంగా దూనుకు వచ్చింది. పై పెదిమ కాలుతున్నట్టున్నా నాకది బాధనిపించనేలేదు.

నీళ్లతో మసకబారిన కళ్లతో, అమ్మ వెనకాతలే నించున్న నా తమ్ముళ్లూ, చెల్లాయీ... అంతవరకే నేను చూసేను.

ఆ తర్వాత ప్రపంచం నాకక్కర లేకపోయింది.

●